11న రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుల పర్యటన

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో ఈనెల 11న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు క్షేత్ర స్థాయి పర్యటన ఉంటుందని సంయుక్త కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో సంబంధిత అధికారులతో ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న సమీక్షా సమావేశానికి హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి సంబంధిత అధికారులంతా హాజరు కావాలని సూచించారు.

పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రంలోనే అత్యంత చిన్న జిల్లా. అందులోనూ అత్యంత వెనుకబడిన జిల్లా. ఆ రంగం ఈ రంగం అనే తేడాలేదు. అన్నింటా వెనుకబాటే. అంతమాత్రాన వనరులు లేవంటే పొరపాటే. విద్య, వైద్య, పర్యాటక, వ్యవసాయం, గిరిజనుల ఉత్పత్తులు వీటి ఆధారంగా అనేక పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో అనుకూలంగా ఉంది. వీటిని ఉపయోగించుకుని ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్న ధ్యేసే పాలకుల్లో కొరవడింది. అధికార యంత్రాంగంలోనూ ఇటువంటి ముందు చూపు కనిపించడం లేదు. దీంతో జిల్లా ఏర్పడి ఏడాదైనా అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగానే ఉంది.

వనరులు పుష్కలం... వినియోగించుకొంటేనే ప్రతిఫలం

- విద్య, వైద్యం కోసం పొరుగు జిల్లాపై ఆధారం
- ఫుడ్‌పార్కులకు అవకాశం ఉన్నా అందిపుచ్చుకునే నాథులు కరువు
- మాటలకే పరిమితమైన పర్యాటకాభివృద్ధి
- మార్కెటింగ్ సదుపాయం లేక దళారులపాలవుతున్న గిరిజన ఉత్పత్తులు

దళారీలకు చింతపండు అమ్ముకుంటున్న గిరిజనులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పార్వతీపురం మన్యం జిల్లా భౌగోళిక స్వరూపంలో సగానికి సగం కొండకోనల్లో విస్తరించివుంది. అటవీ ఉత్పత్తులతో పాటు రకరకాల ఫలసాయాలు విస్తారంగా సాగవుతున్నాయి. గడిచిన రెండు దశాబ్దాలుగా ఆర్‌ఒఎఫ్‌ఆర్ పట్టాలు కూడా ఎక్కువగానే ఇచ్చారు. కానీ, ఆయా భూముల్లో సాగవుతున్న చింతపండు, కొండచీపుర్లు తదితర గిరిజన ఉత్పత్తులు, కూరగాయలు, పండలకు మార్కెట్ సదుపాయం కల్పించలేదు. ఇటు మైదాన ప్రాంతంలో అరటి, మొక్కజొన్న, వరి, పత్తి తదితర వ్యవసాయ, ఉద్యాన పంటలు కూడా ఎక్కువే. వీటిని సకాలంలో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చొరవ చూపడం లేదు. దీంతో, అటు గిరిజనులు, ఇటు మైదాన ప్రాంత రైతులు దళారుల బారిన పడాల్సిన దుస్థితి తప్పలేదు. దీంతో, అసలే పేదరికం. ఆపైన వెనకబాటు తనం. జిల్లాలో ఆరోగ్య వసతులు, ఆసుపత్రులు అంతంత మాత్రమే. ప్రజల అవసరాలకు సరిపోగా లేవు. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి మినహా ఆ పాటి వైద్యం ఎక్కడా అందుబాటులో లేదు. కొద్ది మంది డాక్టర్లతో 10 లక్షల మంది ప్రజలకు వైద్యం ఎలా చేయగలరు?. అసలే ప్రజలు పేదలు. డబ్బు ఖర్చు చేసి ఎక్కడికో వెళ్లి వైద్యం చేయించుకోలేరు. ప్రభుత్వ వైద్యమే దిక్కు. పార్వతీపురం ప్రభుత్వాసుపత్రిని జిల్లా కేంద్రాసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ అందుకు తగ్గట్టు వైద్య సదుపాయాలు, విభాగాలు, వైద్య పరీక్షలు అందుబాటులో లేవు. ఇప్పటికీ విజయనగరం, విశాపట్నంలోని ప్రభుత్వ దవాకానాలే దిక్కుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో పార్వతీపురంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ముందుకొచ్చింది. కురుపాం, పాలకొండ, సాలూరులో అన్ని రకాల స్పెషలిస్ట్ డాక్టర్లు, టెస్టు పరికరాలు, అన్ని సదుపాయాలతో మల్టీ స్పెషాలిటీ హాస్పిటళ్లు ఏర్పాటు చేయాలి. పార్వతీపురంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలి. అప్పుడే అత్యంత వెనుకబడిన మన్యం జిల్లా ప్రజలకు ఆరోగ్య భాగ్యం కలుగుతుంది. డిగ్రీ, పీజి, ఇంజినీరింగ్ విద్య కోసం పొరుగు జిల్లాలపై ఆధారపడాల్సి వస్తోంది. సాలూరు, సీతంపేటలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పార్వతీపురంలోని శ్రీ వెంకటేశ్వరా ఎయిడెడ్ డిగ్రీ కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులు ప్రారంభించాలి. సాలూరు, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనూ పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులు ప్రారంభించడం ద్వారా విద్యలో అవకాశాలను పెంచాలి. అప్పుడే వెనకబడిన మన్యం జిల్లా అభివృద్ధికి నోచుకుంటుంది.

ఇప్పటికీ చాలా గిరిజన గ్రామాలకు రోడ్లు లేవు. రోగులను డోలీల్లో మోసుకొని మైదాన ప్రాంతాలకు తీసుకొస్తున్నారు. రోడ్లకు అటవీశాఖ అనుమతులు ఇవ్వకపోవడం ఆటంకం చెబుతున్న అధికారులు, పాలకులు కార్పొరేట్లు గనులు కొల్లగొట్టుకుపోవడానికి 120 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి మాత్రం అనుమతులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో పాలకులకు గిరిజనులంటే లెక్క లేకపోతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 50గ్రామాల గిరిజనులు, దళితులు, పేదల రాకపోకలకు అవసరమయ్యే నాగావళి నదిపై పూర్ణపాడు-లాబేసు వద్ద వంతెన నిర్మాణం దశాబ్దాలు గడిచిపోతున్నా పూర్తి కాలేదు.

మరోవైపు పర్యాటకులను ఆకర్షించే ఎత్తైన, కొండలు, లోయలు, జలజలపారే జలపాతాలు అనేక చోట్ల ఉన్నాయి. వీటన్నింటినీ పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చేసేందుకు పుష్కలమైన అవకాశాలు ఉన్నాయి. తద్వారా జిల్లాకు ఆదాయం కూడా సమకూరే అవకాశాలు ఉంటాయి. ఇవన్నీ పాలకులు, అధికారులు దృష్టిలో ఉన్నప్పటికీ చిత్తశుద్ధితో ఆదిశగా అడుగులు మాత్రం కనిపించడం లేదు. ఇప్పటికైనా జిల్లా అభివృద్ధిపై దృష్టిసారించాలని జనం కోరుతున్నారు.

రహదారి సౌకర్యం లేక డోలీపై రోగిని తీసుకెళ్తున్న గిరిజనులు

ప్రథమ స్థానంలో ఉండాలనేది కర్తవ్యం : కలెక్టర్

ప్రజాశక్తి -కలెక్టరేట్

ప్రతి అంశంలోనూ జిల్లా ప్రథమ స్థానంలో ఉండాలనేది కర్తవ్యం, సంకల్పంతో పనిచేస్తున్నామని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. జిల్లా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో మంగళవారం కలెక్టర్‌తో పాటు ఎస్‌పి, జెసి, ఎఎస్‌పి, జిల్లా ఉన్నతాధికారులు శ్రమదానం చేశారు. అనంతరం కలెక్టర్ జిల్లా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రజలకు, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రజలు, ప్రతినిధులు తోడ్పాటును అందించాలని కోరారు. జిల్లా ఆవిర్భావ దినోత్సవం వివిధ రకాలుగా చేయవచ్చని, ఒక మంచి సందేశం అందించాలనే శ్రమదానం చేశామన్నారు. ఏడాది కాలంలో జిల్లా మొట్ట మొదటి పరిపాలనా బృందంలో గల అధికారులు, సిబ్బంది చక్కగా పనిచేశారని కొనియాడారు. చక్కటి ప్రణాళికలతో, మంచి ప్రయత్నంతో లక్ష్యాలు సాధించామన్నారు. ఇదే స్ఫూర్తి, పట్టుదల, అంకితభావంతో రానున్న రోజుల్లో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. సుందర పట్టణంగా తీర్చిదిద్దడంలో పట్టణ ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. జిల్లా అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధించినప్పుడు పెద్ద ఎత్తున వేడుకలు చేసుకుందామని సూచించారు. ఎస్‌పి వి. విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ జిల్లా ఆవిర్భావ దినోత్సవం వినూత్నంగా నిర్వహించేందుకు శ్రీకారం చుట్టిన కలెక్టర్‌ను అభినందించారు. జిల్లా అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ కీలక పాత్ర పోషించాలని, ప్రజలకు సంతృప్తికర సేవలు అందించాలని ఆయన కోరారు. శ్రమదానం కార్యక్రమంలో పాల్గొని స్ఫూర్తిదాయక పనులు చేసిన వైద్య ఆరోగ్య శాఖ బందానికి, పశు సంవర్ధక - టి.పి.ఎం.యు బందం, పోలీసు బందం, ఐసిడిఎస్ బందానికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేశన్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ నేతృత్వంలో శ్రమదానం

జిల్లా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శ్రమదానం

శ్రమదానం చేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు

జిల్లా ఆవిర్భావ దినోత్సవం దినోత్సవం సందర్భంగా కలెక్టర్ నిశాంత్ కుమార్ నేతత్వంలో శ్రమదానానికి అధికారులు శ్రీకారం చుట్టారు. కలెక్టర్‌తో పాటు ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు, జెసి ఒ.ఆనంద్, డిఆర్‌ఒ జె.వెంకటరావు, ఎఎస్‌పి ఒ.దిలీప్‌కిరణ్, జిల్లా అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున శ్రమదానంలో పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి కలెక్టర్ కార్యాలయం నుండి జూనియర్ కళాశాల, టౌన్ పోలీస్ స్టేషన్, రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, జిల్లా కలెక్టర్ బంగ్లా వరకూ గల రహదారిలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించడం, ప్రహరీ గోడలకు సున్నం వేసి సుందరంగా తీర్చిదిద్దారు. జిల్లా ఉన్నతాధికారుల సేవలు పలువురికి స్ఫూర్తిని, ప్రేరణను కల్పించాయి.

కలెక్టర్, ఎస్‌పిలకు ఎమ్మెల్యే అభినందన

పార్వతీపురం మన్యం జిల్లా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడును ఆయన కార్యాలయంలో కలిసి ఎంఎల్‌ఎ ఎ.జోగారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తూ, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను, పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడంలోనూ, జిల్లా శాంతిభద్రత పరిరక్షణ, స్నేహపూర్వక వాతావరణం ఏర్పాటు చేయడంలో విశేష కషి చేసినందుకు ఇరువురి అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాను మున్ముముందు మరింత అభివద్ధి పథంలో నడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక వార్డు కౌన్సిలర్ సభ్యులు చీకటి అనురాధ, అర్.చిన్నం నాయుడు, మాజీ కౌన్సిలర్ రెడ్డి రవి కుమార్, వైసీపీ సీనియర్ నాయకులు పల్లె భానుప్రకాష్, బి.ఆదినారాయణ, ఎస్ సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ఆర్‌టిసి లాజిస్టిక్ సేవలు

ప్రజాశక్తి-విజయనగరం

వినియోగదారుల ఆకాంక్షల మేరకు ఎపిఎస్‌ఆర్‌టిసి లాజిస్టిక్స్ సేవలను మరింత విస్తృతం చేయడంలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా ఇకపై ఇంటి వద్ద నుంచే చేసుకోవచ్చని విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.రవికుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ లాజిస్టిక్స్ ఆన్‌లైన్ బుకింగ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సేవలు మంగళవారం నుంచి విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ పట్టణాలకు అందుబాటులో ఉంటాయన్నారు. వినియోగదారులు తమ ఇంటి వద్ద నుంచి www.shipmantra.com లేదా www.apsrtclogistics.in ద్వారా డోర్ పికప్, డోర్ డెలివరీ సౌకర్యం పొందవచ్చన్నారు. 50 కేజీల వరకు, బస్టాండ్ నుంచి ఏడు కిలోమీటర్ల పరిధిలో పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జోన్ కమర్షియల్ సిటిఎం కె.వెంకటరావు, డిపిటిఒ కె.శ్రీనివాసరావు, నెక్ రీజియన్ ఎటిఎం హెచ్.దివ్య, విజయనగరం డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గుజ్జువాయిలో చింతపండు పిక్క తీసే యంత్రాన్ని పరిశీలిస్తున్న పిఒ విష్ణుచరణ్

విడివికెలతో మహిళల ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - కురుపాం

వనధన్ వికాస కేంద్రాల (విడివికె) ద్వారా మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఎంతో దోహదపడతాయని ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ అన్నారు. మంగళవారం తన పర్యటనలో భాగంగా మండలంలోని మొండెంఖల్, గుజ్జువాయి గ్రామాల్లో వైఎస్సార్ క్రాంతి పథకం ద్వారా వనదన్ వికాస కేంద్రాల్లో మహిళా సంఘాల సభ్యులు నడుపుతున్ని చింతపండు పిక్కతీత, కేక్ తయారీ యంత్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలను వీటి లాభనష్టాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే వైకెపి అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గిరిశిఖర గ్రామమైన తిత్తిరిని సందర్శించి అక్కడ వనదన్ వికాస కేంద్రం ద్వారా మహిళలు తయారు, కొనుగోలు చేస్తున్న కొండ చీపుర్లను పరిశీలించారు. వాటిపై వస్తున్న లాభ నష్టాల గూర్చి మహిళలకు అడిగి తెలుసుకుని పలు సూచనలు సలహాలు అందించారు. అలాగే కొండబారిడిలో మహిళా సంఘాల ద్వారా నడుస్తున్న దంపుడు బియ్యం కేంద్రాన్ని పరిశీలించి దానిద్వారా వారు పొందుతున్న లబ్ధి, ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎపిడి వై.సత్యం నాయుడు, ఎపిఎం ఇ. వెంకట కిషోర్, సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి వ్యాఖ్యలు కోర్టు ఉల్లంఘనే

ప్రజాశక్తి - సాలూరు

వివాదాస్పద కొటియా గ్రామాలపై కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలు సుప్రీంకోర్టు తీర్పు ఉల్లంఘన కిందకు వస్తాయని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సిగడాపు బంగారయ్య చెప్పారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఒడిశా, ఆంధ్రా ప్రభుత్వాలకు ఆ గ్రామాలపై హక్కు వుంటుందన్నారు. స్టేటస్ కో ఉత్తర్వులు అమలులో ఉన్న కొటియా గ్రామాల్లో రెండు రాష్ట్రాలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటించవచ్చునని చెప్పారు. కేంద్ర మంత్రిపై చర్యలు తీసుకోవాలని బంగారయ్య డిమాండ్ చేశారు.

కేంద్ర మంత్రి వ్యాఖ్యలపై త్వరలో కేసు

సుప్రీంకోర్టు తీర్పు ఉల్లంఘనకు పాల్పడిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యలపై త్వరలో కోర్టులో కేసు వేయనున్నట్లు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం న్యాయ సలహాదారు రేగు మహేష్ చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వివాదాస్పద కొటియా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు ఆంధ్రాలో ఉంటామని లిఖితపూర్వకంగా జిల్లా ఎస్పీ, కలెక్టర్ లకు ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. సుప్రీం కోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులు అమలులో ఉన్న కొటియా గ్రామాల్లో రెండు రాష్ట్రాలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటించవచ్చునని చెప్పారు. అలాంటి పరిస్థితుల్లో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దుందుడుకు వ్యాఖ్యలు చేయడం సుప్రీంకోర్టు తీర్పు ఉల్లంఘన కిందకు వస్తాయని చెప్పారు. ఈ నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్‌ను కేంద్ర మంత్రి వర్గం నుంచి తొలగించాలని కోరుతూ కేసు వేయనున్నట్లు న్యాయ వాది రేగు మహేష్ చెప్పారు.

నేడు జగ్జీవన్‌రామ్ జయంతి

ప్రజాశక్తి - కలెక్టరేట్

బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఇన్ ఛార్జ్ జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారిత అధికారి పి. శశి భూషణ్ రావు తెలిపారు. ఈ మేరకు మంగళ వారం ఒక ప్రకటన విడుదల చేశారు. బుధ వారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం, అనంతరం సభ జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఇతర అధికారులు పాల్గొంటారని ఆయన వివరించారు.

ఎగువతాడికొండలో అంగన్‌వాడీ పిల్లలకు పాఠాలు చెబుతున్న సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీ ప్రాంతంలో విద్యా ప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయుల కృషి చేయాలని పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమార్ సూచించారు. మండలంలోని మంగళవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యా ప్రమాణాల ఏ మేరకు మెరుగుపడ్డాయో తెలుసుకునేందుకు తాడికొండ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, కుక్కిడిలో ద్రవ్య సహాయక పాఠశాల, ఎగువ తాడికొండలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన సందర్శించారు. తాడికొండ పాఠశాలలో విద్యార్థులు చదువు పట్ల ఏ మేరకు పట్టు సాధించారన్న దానిపై వారి నుంచి పలు ప్రశ్నలు రాబట్టారు. పాఠ్యాంశాలను విద్యార్థులచే చదివించారు. చదువుకున్న ప్రాధాన్యతను గుర్తించి ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉండి కష్టపడి చదవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఆటపాటలతో విద్యా బోధన చేయాలన్నారు. అప్పుడే విద్యార్థులు ప్రతిరోజు అంగన్వాడీ కేంద్రాలకు రావడానికి ఆసక్తి చూపుతారని అన్నారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలతో ఎఫ్‌టిఒఎల్‌ఆర్‌పై (భూ రికార్డులు) సమీక్షించారు. అనంతరం పి.ఆమిటిలో నిర్మాణంలో ఉన్న జియో టవర్ పనులు పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ తహశీల్దార్ రాజేంద్ర ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

ఆసరా చెక్కుల పంపిణీలో డిప్యూటీ సిఎం, జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి - మక్కువ

సంక్షేమ, అభివృద్ధి రెండు కళ్లు వంటివని, ఆ రెండే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన వైయస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో రూ.13 కోట్ల నిధులతో నాలుగు లైన్ల రహదారి నిర్మాణం చేపడతామని దీనికి అనుమతులు కూడా వచ్చాయని తెలిపారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించి రహదారులు, వంతెనలు నిర్మించడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ తమ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. జెడ్‌పిటిసి సభ్యులు మావవుడి శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ 40 ఏళ్ల రాజకీయ జీవితంలో మండలంలో ఏకతాటిగా పరిపాలన సాగిస్తున్నామని, జిల్లాస్థాయిలో ఉన్న పెద్దలు ఈ విషయాన్ని గుర్తించి రాజకీయంగా తగు ప్రాధాన్యతలు కల్పించడంలో శ్రద్ధ చూపడంలేదని అన్నారు. అనంతరం రూ.3కోట్ల 87 లక్షల నిధుల చెక్కును 10302 సంఘాలకు ఈ సందర్భంగా రాజన్న దొర అందజేశారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసరావు, ఉప ముఖ్యమంత్రి రాజన్న దొరకు గజమాలతో మావుడి సోదరులు శ్రీనివాసరావు, రంగనాయుడు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ దేవకుమార్, ఎపిఎం సన్నిబాబు, మండలంలోని అన్ని పంచాయతీల వాలంటీర్లు, గృహసారథులు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న రాజన్నదొర, మజ్జి శ్రీనివాసరావు

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

వీరఘట్టం:మండల కేంద్రంలోని సచివాలయం పరిధి-2లో కన్వీనర్ దూషి జానకమ్మ ఆధ్వర్యంలో మంగళవారం వైయస్సార్ ఆసరా కానుక ఉత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల మహిళలు, సిఎఫ్‌లు , పెద్దలు పాల్గొన్నారు

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం సురక్షితం

ప్రజాశక్తి - కొమరాడ

ప్రభుత్వాసుపత్రిలో గర్భిణుల ప్రసవం సురక్షితమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు అన్నారు. గర్భిణులు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఆపరేషన్ చేయించుకోవాలి, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మంగళవారం కొమరాడ, కెఆర్‌బి పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగిన ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఆశా కార్యకర్త దగ్గర గర్భ నిర్ధారణ పరీక్ష కిట్లు అందుబాటులో ఉన్నాయని, దీనివల్ల హైరిస్క్ గర్భిణులను తొందరగా గుర్తించి వారికి సరైన వైద్యం అందించవచ్చని తెలిపారు. ప్రతి గర్భిణి కిల్కారి యాప్ గురించి తెలుసుకొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిహెచ్‌సిలో జరిగే అబార్షన్లు, ఐయుడి, స్టిల్ బర్త్ రికార్డులు సచివాలయం వారీగా ఉంచి ప్రతి నెలా వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి సమీక్షించాలని ఆదేశించారు. గర్భిణులు, రక్తహీనతతో బాధపడుతున్న అందరికీ అవసరమైన మందులు తప్పని సరిగా అందాలని ఆదేశించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం రోజున గర్భిణులు, రక్తపోటు, షుగర్‌తో బాధపడే వారికి వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల పర్యటన తప్పనిసరిగా చేయాలని అన్నారు. మంచానికి పరిమితమైన రోగులను, ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం తీసుకొని డిశ్చార్జ్ అయిన వారి అభిప్రాయం తీసుకోవాలని ఆదేశించారు. పిహెచ్‌సిల్లో పరీక్షల తీరును సమీక్షించారు. నిరంతరం పరీక్షలు జరుగుతూనే ఉండాలని వైద్యాధికారికి, లాబ్ టెక్నీషియన్ కు ఆదేశాలు జారీ చేశారు.

ఆశాలనుద్దేశించి మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ జగన్నాథరావు



సమావేశంలో మాట్లాడుతున్న సవరభాష వాలంటీర్లసంఘం రాష్ట్ర కార్యదర్శి దొంబు

సవరభాష వాలంటీర్లను రెన్యువల్ చేయాలి

సీతంపేట : సవరభాష వాలంటీర్లను రెన్యువల్ చేయాలని ఆ భాషా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.దొంబు డిమాండ్ చేశారు. సవరభాష వాలంటీర్ల సర్వసభ్య సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పి.మాధవరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా దొంబు మాట్లాడుతూ వాలంటీర్లకు కనీసవేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై అఖిల భారత ఎస్‌టి కమిషన్‌కు 30 వేల సంతకాలు సేకరించి ఇచ్చేందుకు ఇవ్వాలని, రాష్ట్రంలోని ఎస్‌పిడికి కూడా వినతిని ఇవ్వాలని ఆయన తెలిపారు. సమావేశంలో సవరభాష వాలంటీర్ల సంఘం నాయకులు ఎస్.ఆనంద్, ఎస్.పాపారావు, ఎం.భారతి, ఎస్.రాజు, సుజాత, గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతిరావు, పి.సాంబయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఇ హనుమంతరావు

నీటి కొరత లేకుండా ఉండాలి

సీతానగరం: జగనన్న కాలనీలో మంచినీరు కొరత లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ హనుమంతరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా పనులు చేసేందుకు కాలనీలో మంచినీరు బోర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులు ప్రభుత్వ కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఎంపిడిఒ ఎంఎల్ఎస్‌వి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పవన్ కుమార్, హౌసింగ్ ఎఇ సిహెచ్ జానకీరామ్, పలు గ్రామాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, విద్యార్థులు

ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి

గుమ్మలక్ష్మీపురం : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 115 వ జయంతి వేడుకలను మూలిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సామల సింహాచలం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జగ్జీవన్ రామ్ చిత్రానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం హెచ్‌ఎం సామల మాట్లాడుతూ భారత దేశానికి మొట్టమొదటి కార్మిక మంత్రిగా, వ్యవసాయ శాఖామంత్రిగా, ఉప ప్రధానిగా జగ్జీవన్ రాం విశిష్ట సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ టీచర్ ఎన్ సుధాకర్ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులను గుర్తించాలి

వీరఘట్టం : గ్రామాల్లోనే గర్భిణులను గుర్తించాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆశా కార్యకర్తలకు సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆశా కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గర్భిణీలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలుపడేలా చూడాలన్నారు. గర్భిణీలకు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలన్నారు. అలాగే ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు జరిగేలా గర్భిణీలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు పార్వతి, నవోనమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ ఆదిలక్ష్మి ,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచార సామగ్రిని అందజేస్తున్న వైసిపి నాయకులు

జగనన్నే మా భవిష్యత్తు ప్రచార సామగ్రి పంపిణీ

సీతానగరం : జగనన్నే మా భవిష్యత్తు ప్రచార సామాగ్రిని స్థానిక జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, వైసిపి నాయకులు బి.చిట్టిరాజు, బి శ్రీరాములు నాయుడు మంగళవారం పంపిణీ చేశారు. మండలంలోని చినబోగిలి, కాశీపేట, అంటిపేట, లచ్చయ్యపేట తదితర గ్రామాల్లో మంగళవారం గృహసారధలకు ఈ సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహ సారధులంతా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి లబ్ధిదారునికి ఈ సామగ్రి అందజేయాలన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 7 నుంచి 20వరకు కొనసాగుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు టి.వెంకట అప్పలనాయుడు, నారాయణ, ఆర్‌వి పార్థసారథి, వాకాడ నాగేశ్వరరావు, ఎస్.తిరుపతిరావు, ఎస్.మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.2.49 లక్షలకు వాహనాల వేలం

కురుపాం : ఎస్ఇబి దాడుల్లో ఇటీవల పట్టుబడిన వాహనాలను మంగళవారం ఎస్ఇబి ఎస్సై బివిఎస్ భూషణరావు ఆధ్వర్యంలో వేలం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొలరా పికప్ వాహనం, నాలుగు ద్విచక్ర వాహనాలు జీఎస్టీతో కలిపి రూ 2,49,040కు వేలంపాటలో వెళ్లినట్లు తెలిపారు. అనంతరం దాడుల్లో పట్టుబడినటువంటి 1004 లీటర్ల నాటు సారా ధ్వంసం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

వేలం నిర్వహిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

వాడీవేడిగా మండల సమావేశం

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి బొమ్మాళి భాను అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సమస్యలపై పలు శాఖల అధికారులను సర్పంచ్‌లు, ఎంపిటిసిలు నిలదీయడంతో వాడీవేడిగా సాగింది. తొలుత విద్యుత్‌శాఖపై జరిగిన చర్చలో ఎఇ రమేష్ పనితీరుపై సర్పంచ్‌లు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. చింతాడ సర్పంచ్ కళావతి తమ గ్రామంలో విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయని చెబుతున్నా పట్టించుకోవడం లేదని, ఇప్పటికి మూడు సమావేశాల్లో ఈ సమస్య తీసుకొచ్చామని అయినా పట్టించుకోలేదని నిలదీశారు. లుంబూరు సర్పంచ్ తిర్లంగి ఉపేంద్ర మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలు నేలకొరిగి ఉన్నప్పటికీ ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడమేమిటని ప్రశ్నించారు. భాసూరు సర్పంచ్ గురుబిల్లి గురివినాయుడు మాట్లాడుతూ తమ గ్రామంలో పూర్తిగా లోఓల్టేజీ సమస్య ఉందని చెబుతున్నా పట్టించుకోలేదన్నారు. అలాగే ఎంపిటిసిలకు, సర్పంచ్‌లకు ప్రభుత్వ కార్యక్రమాలపై ఆహ్వానం అందడం లేదని వైస్ ఎంపిపి కనపాక సూర్యప్రకాష్ నిలదీశారు. విద్య, ఐసిడిఎస్ శాఖలపై జరిగిన చర్చలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల్లో గ్రామస్థాయిలో సర్పంచ్‌లను, ఎంపిటిసిలను కార్యక్రమాలకు భాగస్వాములను చేయకపోవడానికి కారణమేమిటని నిలదీశారు. బిసి సంక్షేమ శాఖ, మత్స్య, దేవాదాయ, ఆర్‌టిసి పలు శాఖల అధికారులు గైర్హాజరుకావడం పట్ల సభ్యులు ముక్తకంఠంగా ఖండించారు. దీనిపై కలెక్టర్‌కు నివేదించాలని వైస్ ఎంపిపి కనపాక సూర్యప్రకాష్ ఎంపిడిఒ డొంక త్రినాధులకు సూచించారు. ముఖ్యఅతిధిగా హాజరైన పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ ఇప్పటికీ గ్రామాల్లో ఉండిపోయిన ధాన్యం కొనుగోలు చేసేలా కృషి చేస్తానని, అవసరమైతే జాయింట్ కలెక్టర్, కలెక్టర్, సివిల్ సప్లై కమిషనర్‌తో మాట్లాడుతానని సభలో హామీ ఇచ్చారు. చెక్ పోస్టు జంక్షన్ నుంచి సంకిలి సుగర్‌ఫ్యాక్టరీ వరకు ఆర్‌అండ్ బి రోడ్డు మంజూరైందని, ఈ పనులు మరో వారం రోజుల్లో ప్రారంభమవుతాయన్నారు. సొంత స్థలం ఉండి ఇళ్లు కట్టుకుంటున్న వారికి స్కీమ్‌లు మంజూరు చేయాలన్నారు. ఏ ఒక్కరు తప్పిపోకూడదని, అందరిని గుర్తించాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపిపి అనీల్‌కుమార్, డిప్యూటీ తహశీల్దార్ బుచ్చయ్య తదితరులున్నారు.

పోలీసులు అప్రమత్తం

బోయ, వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని నిరరసిస్తూ గిరిజన సంఘాలు ఉద్యమానికి తలపెట్టడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పూర్తిగా పోలీసు బలగాలు ప్రధాన రహదారుల దగ్గర పహారా కాస్తున్నారు. ముఖ్యంగా ఎంఎల్ఎపై ఈ నిరసన సెగ ఉంటుందని గుర్తించిన పోలీసు వర్గాలు మంగళవారం అప్రమత్తమయ్యాయి. డిఎస్‌పి జి.కృష్ణారావు ఏలాం జంక్షన్ దగ్గర గట్టిబందోబస్తు చేపట్టారు. ఏజెన్సీకి వెళ్లే రహదారి కావడంతో అక్కడ పోలీసు బలగాలు మోహరించాయి.

సీతంపేట : మండలంలోని రైతుల భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలని పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి అధికారులకు సూచించారు. స్థానిక వైటిసిలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి బి.ఆదినారాయణ అధ్యక్షతన జరిగింది.

పాలకొండ : మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

బోయ, వాల్మీలకు ఎస్టీల్లో చేర్చద్దంటూ తీర్మానాన్ని ఎమ్మెల్యేకు అందజేస్తున్న సభ్యులు

ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలు ఉంటే సచివాలయం, రెవెన్యూ శాఖ ద్వారా పరిష్కరించుకోవాలని, లేకుంటే ఆ సమస్య తమ వద్దకు తీసుకురావాలని అన్నారు. నియోజకవర్గానికి 6,187 ఇళ్లు మంజూరయ్యాన్నారు. సీతంపేట ఏజెన్సీలో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ పనులు జరుగుతున్నాయని, అలాగే ఏరియా ఆసుపత్రి పనులు దాదాపు పూర్తవుతున్నాయని తెలిపారు. గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని అన్నారు. ఎక్కువ మంది పిల్లలుంటే మినీ అంగన్వాడి కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఐసిడిఎస్ సిబ్బందికి సూచించారు. ఉపాధి పథకంలో సిసి రోడ్లు, కాలువలు మంజూరు చేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. అనంతరం ధారపాడు సర్పంచి సుందరమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్య పరిష్కారం కావడంలేదన్నారు. దీనికి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆ సమస్య వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ధారపాడు, ధోనుబాయి సర్పంచ్ వెంకినాయుడు మాట్లాడుతూ పిహెచ్‌సిల్లో అంబులెన్స్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం బోయ వాల్మీకిలను ఎస్టీల్లో చేర్చొద్దని సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు మండల సమావేశంలో తీర్మానం చేసి ఎమ్మెల్యేకు వినతి పత్రం పత్రం సమర్పించారు. సమావేశంలో తహశీల్దార్ నరసింహమూర్తి, ఎంపిడిఒ కె.సత్యం, ఎఎంసి చైర్మన్ మోహనరావు, ఐసిడిఎస్ పిఒ రంగలక్ష్మి, జిల్లా కోఆప్షన్ సభ్యులు లక్ష్మి, వైస్ ఎంపిపిలు విజయలక్ష్మి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు

కొండచీపుర్లకు మద్దతుధర లేక గిరిజనుల అవస్థలు

అడ్డగోలుగా దోచుకుంటున్న దళారులు

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనులు ఎంతో శ్రమించి సేకరించిన ఉత్పత్తుల్లో కొండచీపురు ఒకటి. గిరిజనులకు ఆర్థికంగా చేయుతనిచ్చేది కొండ చీపురు. అలాంటి కొండ చీపుర్లకు మద్దతు ధర లేకపోవడంతో గిరిజనులు విలవిలాడుతున్నారు. సీతంపేట ఏజెన్సీ కొండచీపుర్లు అంటే మైదాన ప్రాంత వ్యాపారులు ప్రజలు ఆసక్తి చూపుతారు. ఎందుకంటే నాణ్యతగా నాజుగ్గా, తేలిగ్గా ఏడాది పొడవునా వస్తుందని మొగ్గు చూపుతారు. అయినా గిట్టుబాటు ధర లేకపోవడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఏజెన్సీలో సుమారు 20వేల ఎకరాల్లో కొండ చీపుర్ల తప్పలు విస్తరించి ఉన్నాయి. అక్టోబర్, నవంబర్‌లో బాగా ఏపుగా పెరుగుతాయి. ఆ సమయంలో వర్షాలు సకాలంలో పడకపోవడంతో ఈ ఏడాది పంట తక్కువే వచ్చిందని గిరిజనులు తెలుపుతున్నారు. ఏజెన్సీలో పూతికవలస, కుసిమి, శంబాం, పొల్ల పరిసర ప్రాంతాల్లో కొండచీపుర్లు ప్రాంతం ఉంది. గిరిజనుల అవసరాలు తెలుసుకొని కొంతమంది వ్యాపారులు చీపుర్లు ఎక్కువగా ఉన్న కొండను లీజుకు తీసుకోవడమై, కిలో రూ.80 చొప్పున కొండచీపురులు పుల్లలను తీసుకొచ్చిన గిరిజనులకు కూలి ఇచ్చి వాళ్ల చేతే కట్టలు కట్టిస్తారు. వీటిని రాజమండ్రి, విజయనగరం, విశాఖ, విజయవాడ, హైదరాబాద్, కర్ణాటక, భువనేశ్వర్, పర్లాకిమిడి తదితర పట్టణాల్లో ఒక్కొక్కటి రూ.100 వరకు విక్రయించి అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. సంతల్లో మాత్రం గిరిజనుల వద్ద రూ.40నుంచి రూ.45 చొప్పునకారు చౌకగా కొనుగోలు చేసి వ్యాపారులు లాభాలు ఆర్జిస్తున్నారు.

సంతలో చీపుర్లు అమ్ముతున్న గిరిజనులు

ధర పెరగడం లేదు

కొండ చీపుర్లకు అప్పటి నుండి అదే ధర పలుకుతుంది. వ్యాపారులు ధర పెంచడం లేదు. కష్టపడి సేకరించినా ప్రయోజనం ఉండడం లేదని గిరిజనులు వసంతరావు తెలిపారు. జిసిసి వారు ఏ గ్రేడ్ రూ.45, బి-గ్రేడ్ రూ.40, సిగ్రేడ్ రూ.35 చొప్పున కొనుగోలు చేస్తున్నారు దీనిపై జిసిసి మేనేజర్ దాసరి కృష్ణ వద్ద ప్రస్తావించగా ఈ ఏడాది సీతంపేట డివిజన్లో లక్ష కొండ చీపురులు వరకు కొనుగోలు చేశామని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు .

గిట్టుబాటు ధర కల్పించాలి

సీతంపేట ఏజెన్సీలో కొండ చీపుర్లు ఎక్కువ కాలం మన్నిక వస్తుంది. కావున ప్రభుత్వమే మార్కెట్ ధర కల్పించాలి.

పాలక సాంబయ్య.
గిరిజన సంఘం సీనియర్ నాయకులు

పోస్టర్‌ను విడుదల చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చొద్దు

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద నిరసన పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - కొమరాడ

బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే తీర్మాణాన్ని తక్షణమే ప్రభుత్వం రద్దు చేయాలని గిరిజన సంఘం నాయకులు హిమరక రామారావు డిమాండ్ చేశారు. బోయ, వాల్మీకులను ఎస్టీలో చేర్చుతూ ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈనెల 8న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ గోడ పత్రిక విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బోయ వాల్మీకి కులస్తుల్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపడం దుర్మార్గమైన చర్యని అన్నారు. ఇదే జరిగితే రాష్ట్రంలోని 35 లక్షల మంది గిరిజనులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే జిఒ 3ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, 1/70 చట్టం అమలు చేయాలని, జిఒ 52ను రద్దు చేయాలని, నాన్ షెడ్యూల్ గ్రామాలను ఐదో షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని, మన్యంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శివున్నాయుడు, లక్ష్మ పాల్గొన్నారు.

ఏడాదైనా అభివృద్ధి లేదు

వీరఘట్టం : పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడి ఏడాదైనా మండలంలో అభివృద్ధి జాడేలేదని జనసేన పాలకొండ నియోజకవర్గం బాధ్యులు ఎం.పుండరీకం అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. వీరఘట్టం మండల కేంద్రంలోని ప్రధాన రహదారి విస్తీర్ణ అభివృద్ధి పనులు నేటికీ జరగలేదన్నారు. 30 పడకల ఆసుపత్రి, రైతు బజారు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు. కిమ్మి -రుషింగి గ్రామాల మధ్య నాగావళి నదిపై వంతెన నిర్మాణ పనులు పూర్తయినా, ఇరువైపులా రహదారి పనులు పూర్తికాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి వీరఘట్టం మండల సమస్యలు పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సాహితీ ఉత్సవాలకు కోడూరుకు ఆహ్వానం

సాలూరు : ఈనెల 9,10తేదీల్లో తిరుపతి మహతి ఆడిటోరి యంలో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు పట్టణానికి చెందిన డాక్టర్ కోడూరు సాయి శ్రీనివాసరావుకి ఆహ్వానం అందింది. తిరుపతికి చెందిన తెలుగు సాహితీ సాంస్కృతిక సామాజిక సేవాసంస్థ శ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ నుంచి కోడూరు సాయి శ్రీనివాసరావుకు ఆహ్వానం అందింది. కోడూరుకు ఆహ్వానం అందడం పట్ల ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.గణేశ్వరరావు, డాక్టర్ ఎ.మోహనరావు, అర్బన్ బ్యాంక్ కార్యదర్శి బి.వేణుగోపాలరావు, మాజీ చైర్మన్ కూనిశెట్టి భీమారావు హర్షం వ్యక్తంచేశారు.

గిరిజనులకు రెడ్‌క్రాస్ సరుకులు పంపిణీ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పార్వతీపురం మన్యం జిల్లా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం వెలగవలస పంచాయతీ పిండిలోవలోని గిరిజనులకు హైజానిక్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు మాట్లాడుతూ ప్రజలంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే విద్యార్థుల చదువులపై ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు శ్రద్ధ చూపించాలని కోరారు. రక్తహీనతతో బాధపడుతున్న గిరిజనులకు తగు సూచనలు సలహాలిచ్చారు. గిరిజన మహిళలకు చీరలు, చిన్నపిల్లలకు బిస్కెట్స్, చాక్లెట్లు అందజేశారు. గిరిజన యువకులకు, పెద్దలకు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణరావు, కోశాధికారి పెంటపాటి సూర్యారావు, మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు చుక్క భాస్కరరావు, గెంబలి గణేష్, బోటు రామకష్ణ, సర్పంచ్ మెల్లిక వెంకయ్య, సెక్రటరీ గుజ్జల పకీరు, ఉపాధ్యాయులు, జీవితకాల సభ్యులు, స్వచ్ఛంద కార్యకర్తలు, జిల్లా కోఆర్డినేటర్ యమ్మల జనార్ధన రావు పాల్గొన్నారు.

గిరిజనులకు సరుకులు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజల చెంతకు వైద్యం

ప్రజాశక్తి - కొమరాడ

పేద ప్రజలకు సరైన వైద్యం అందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కుటుంబ వైద్యుడు విధానంతో ప్రజల చెంతకు వైద్యం చేరుతుందని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని చినఖేర్జలలో కుటుంబ వైద్యులు విధానంలో భాగంగా ఇంటింటికి వెళ్లి వైద్య తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి గ్రామంలోని పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి పిల్లలకు వైద్య తనిఖీలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వారికి ఈసీజీ, రక్త పరీక్షలు నిర్వహించారు. అవసరమైన రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ బహిరంగ వేలం పాట

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదబోగిలి పంచాయతీ పరిధిలో గల సీతానగరం మార్కెట్ బహిరంగ వేలం పాట సర్పంచ్ జె.తేరేజమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరం గానూ రూ.లక్షా71వేలకు సంత మార్కెట్ వేలంపాట అయ్యింది. ఈ బహిరంగ వేలంపాటలో ముగ్గురు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, పెదభోగిలి ఇఒ జి.వెంకటరమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొబైల్ ఫిష్ వెండింగ్ యూనిట్‌ను లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

ఫిష్ ఆంధ్రా.. ఫిట్ ఆంధ్రా యూనిట్లు ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొండరూరల్

ఫిష్ ఆంధ్ర .. ఫిట్ ఆంధ్రా కార్యక్రమలో భాగంగా మొబైల్ ఫిష్ వెండింగ్ యూనిట్లను స్థానిక వి.కళావతి మంగళవారం పాలకొండలో ప్రారంభించారు. మహిళల కేటగిరీలో ఎన్‌కె రాజపురంకు చెందిన సాలిపు కనకలక్ష్మికి మంజూరైన యూనిట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. నియోజకవర్గంలో త్రీ వీలర్ వాహనాలు ఐదు, ఫోర్ వీలర్ వాహనాలు మూడు మంజూరయ్యాయని, తద్వారా లైవ్ చేపలు వాహనాల ద్వారా విక్రయించవచ్చని ఆమె చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళ కేటగిరిలో 60శాతం రాయితీపై యూనిట్ పొందవచ్చునని, అర్హులైన లబ్ధిదారులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె చెప్పారు. 75శాతం సబ్సిడీతో ఫిష్ ఆంధ్ర షాపులు కూడా ఏర్పాటు చేసుకోవచ్చని, 10శాతం వాటా డిసిసిబిలో డిపాజిట్ చేసి మిగిలిన మొత్తం రుణ సౌకర్యం పొందవచ్చని సూచించారు. పాలకొండ డివిజన్లో ప్రస్తుతం 27 మినీ చేపల విక్రయం షాపులు ఉన్నాయని తెలిపారు. రాయితీపై యూనిట్లను పొందవచ్చని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మత్స్య కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పాండ్రంకి మురళీకృష్ణ, పాలకొండ మత్స్య అభివృద్ధి అధికారి తదితరులు పాల్గొన్నారు.



కురుపాంలో నిరసన తెలుపుతున్న కెజిబివి ఉద్యోగులు

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

సమగ్ర సర్వ శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ చేయాలని ఆ ఉద్యోగులు స్థానిక ఎంఆర్‌సి వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి గతంలో పాదయాత్రలో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని అన్నారు. తక్షణమే ఎంపిటిఎస్ కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల పని చేస్తున్న కాంటాక్ట్ ఉద్యోగులకు పిఆర్‌సి అమలు చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా తక్షణమే మినిమం టైం స్కేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు శ్రీను, రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే కురుపాం, బలిజిపేట, పాచిపెంట తదితర మండలాల్లోని ఎంఆర్‌సి కార్యాలయాల వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు.

నేరాలు ఘోరాలు

తాబేళవలసలో రెండు పూరిళ్లు దగ్ధం

కురుపాం : మండలంలో మొండెంఖల్ పంచాయితీ తాబేలవలసకు చెందిన బిడ్డిక వెంకటరావు, ఊయక మాసయ్యకు చెందిన రెండు పూరిళ్లు సోమవారం అర్ధరాత్రి అగ్నికి ఆహుతయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లు కాలుతున్న సమయంలో మెళకువ రావడంతో ప్రాణ నష్టం జరగకుండా తమ ప్రాణాలు తాము కాపాడుకోగలిగామని తెలిపారు. అక్కడే ఉన్న జీడిపిక్కలు, చింతపండు, ఆహార ధాన్యాలు బూదయ్యాయన్నారు. దీంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

ప్రమాదంలో దగ్ధమైన ఇళ్లు

భార్యను ఆత్మహత్యకు ప్రేరేపించిన భర్తకు జైలు

సాలూరు : పట్టణంలోని పెద హరిజన పేటలో భార్య బోనెల ధనలక్ష్మిని ఆత్మహత్యకు ప్రేరేపించిన భర్త యజ్జల రాజుకు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ బొబ్బిలి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు మంగళవారం తీర్పు చెప్పింది. 2016లో జరిగిన ఈ కేసుకు సంబంధించిన తీర్పులో ముద్దాయి రాజుకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధించినట్లు టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

శృంగవరపుకోట : పట్టణంలోని జలగల బంధ వద్ద సోమవారం రాత్రి ఎస్ కోట నుంచి బొడ్డవర వెళుతున్న తండ్రి కొడుకులకు జరిగిన రోడ్డు ప్రమాదం తీవ్రంగా గాయపడిన తండ్రి కుంచు చిన్నయ్య చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ కోట నుంచి మోటారు బైక్ పై బొడ్డవర వైపు వెళుతున్న తండ్రి కొడుకులు పట్టణంలోని జలగలబంద వద్ద సిమెంట్ పైపులను ఢీకొన్న ఘటనలో ఇరువురికి గాయాలు కాగా తండ్రి చిన్నయ్య తలకు తీవ్ర గాయం కావడంతో ఆయనను విజయనగరం జిల్లా కేంద్రస్పత్రికి తరలించారు. అక్కడ చిన్నయ్య ఆరోగ్య పరిస్థితి విషమించడంతో జిల్లా ఆసుపత్రి నుంచి మంగళవారం విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడని